kalamdaily.com

# కలం
ప్రజల గళం...

Follow on: Kalamtelugu

శుక్రవారం • 01-05-2026

పేజీలు: 3

360° SINGLE TOPIC

కెరీర్ వర్సెస్ క్రెడిల్

# డింక్ కపుల్స్!

‘డ్యుయల్ ఇన్‌కం నో కిడ్స్’

**వ్యక్తిగత స్వేచ్ఛకే యువత ప్రాధాన్యం**
**బాధ్యతలను భారంగా భావిస్తున్న జంటలు**
**పిల్లలు లేని ప్రపంచం వైపు అడుగులు**

నాడు అరవై మంది ఉండే ఉమ్మడి కుటుంబం.. డింక్ కల్చర్ పుణ్యమా అని నేడు ఇద్దరికే పరిమితమైంది. రక్త సంబంధాల కంటే వ్యక్తిగత స్వేచ్ఛకే నేటి తరం ప్రాధాన్యత ఇస్తున్నది. బాధ్యతలను భారంగా భావిస్తూ.. పిల్లలు లేని ప్రపంచం వైపు యువత అడుగులు వేస్తున్నది. ఒకప్పుడు మన దేశంలో ఉమ్మడి కుటుంబాలే సమాజానికి పునాది. తాతలు, తండ్రులు, చిన్నాన్నలు అందరూ కలిసి ఉమ్మడి కుటుంబంగా ఒకే గొడుగు కింద ఉండేవారు. బంధాలు, అనుబంధాల మధ్య పిల్లలు పెరిగేవారు. కాలక్రమేణా ఉద్యోగాలు, చదువుల కోసం పెద్ద కుటుంబాలు విడిపోయాయి. భార్యాభర్తలు, పిల్లలతో కూడిన చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. డింక్ కారణంగా ఇప్పుడు ఆ వ్యవస్థ కూడా కుప్పకూలుతున్నది. ఒకవైపు జనాభా తగ్గుతున్నదని, పిల్లలను కనాలని ప్రభుత్వాలు చెబుతున్నా.. నేటి తరం యువత మాత్రం అందుకు భిన్నంగా ఆలోచిస్తున్నది. పిల్లల పెంపకం, చదువులు, బాధ్యతల వల్ల తమ వ్యక్తిగత స్వేచ్ఛ దెబ్బతింటుందని భావిస్తున్నది. ‘మా సంపాదన.. మా ఇష్టం’ అంటున్నాయి. డింక్ కల్చర్ ఎక్కడ మొదలైంది.. ఇండియాలో ఎందుకు పెరుగుతున్నది.. దీని వల్ల భారత సమాజంపై పడే ప్రభావమేంటి.. వారుసులు లేని డింక్ కపుల్స్‌ని వృద్ధాప్యంలో చూసుకునేదెవరు.. ఇలాంటి సవాళ్లపై కలం 360 స్పెషల్ స్టోరీ..

- కలం, సెంట్రల్ డెస్క్



ఏఐ ఫోటో

34 ఏండ్ల రాజేశ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, 32 ఏండ్ల భార్య స్నేహ మార్కెటింగ్ హెడ్. ఇద్దరూ గుజరాత్‌లో ఒకే ఐటీ కంపెనీలో పని చేస్తున్నారు. ఇద్దరి ఇన్‌కమ్ ఏడాదికి రూ.50 లక్షలు. 2025లో పెండ్లి చేసుకున్నారు. కెరీర్‌లో బాగా సెటిల్ అవ్వాలనుకుంటున్నారు. ఆర్థిక స్వేచ్ఛ కోరుకుంటున్నారు. పిల్లలు వద్దని డిసైడ్ అయ్యారు. ఏడాదికి రెండు సార్లు ఫారిన్ టూర్లకు వెళ్లామనుకుంటున్నారు. అహ్మదాబాద్‌లో 3 బీహెచ్‌కే ఫ్లాట్ కొన్నారు. పిల్లల కోసం దాచుకోవాల్సిన అవసరం లేకపోవడంతో ఆ మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారు.

38 ఏండ్ల అమిత్, 28 ఏండ్ల రియా.. బెంగళూరులో నివాసం ఉంటున్నారు. అమిత్ స్టార్టప్ కంపెనీలో పని చేస్తుండగా.. రియా ఫ్రీలాన్స్ గ్రాఫిక్ డిజైనర్. వీరికి పిల్లల కంటే మూగ జీవాలంటే ప్రాణం. పిల్లల పెంపకం వల్ల కలిగే ఒత్తిడి వద్దనుకున్నారు. రెండు కుక్కలను దత్తత తీసుకున్నారు. పెట్ పేరెంట్స్‌గా పిలుచుకుంటున్నారు. పిల్లల స్కూల్ ఫీజుల భయం లేదు. వీకెండ్స్ అంతా తమ పెట్స్‌తో కలిసి పెట్ ఫ్రెండ్లీ రిసార్ట్స్‌లో గడుపుతున్నారు.



40 ఏండ్ల విక్రమ్, 36 ఏండ్ల అంజలి.. ముంబైలో నివాసం ఉంటున్నారు. విక్రమ్ ఒక ఎన్జీవోలో పని చేస్తుండగా.. అంజలి ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్. ప్రపంచంలో పెరుగుతున్న జనాభా, కాలుష్యం, వనరుల కొరతను చూసి వీరు ఆందోళన చెందారు. ఇలాంటి ప్రపంచంలోకి కొత్త ప్రాణిని తీసుకురావడం కరెక్ట్ కాదని భావించి జింక్ (గ్రీన్ ఇన్‌క్లినేషన్, నో కిడ్స్) రూట్‌ను ఎంచుకున్నారు. ఇన్‌కమ్‌ను అనాథ పిల్లల చదువులకు ఖర్చుపెడ్తున్నారు.





# DINK
# డింక్ అంటే ఏంటి?

డింక్'.. 'డ్యుయల్ ఇన్‌కం, నో కిడ్స్' అనేది ఒక సామాజిక, ఆర్థిక జీవనశైలి. వరల్డ్ వైడ్‌గా కొత్తగా పెండ్లైన జంటలు ఈ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. దంపతులు ఇద్దరూ ఉద్యోగం లేదా వ్యాపారం చేస్తూ సంపాదిస్తుంటారు. వీరు పిల్లలను వద్దనుకుంటారు. డింక్ అంటే ఇదే. ఇంటికి వచ్చే ఆదాయం ఎక్కువ.. కానీ, ఖర్చులు.. బాధ్యతలు తక్కువ. ఇండియన్ కపుల్స్ ఈ ట్రెండ్‌ను ఎక్కువ ఫాలో అవుతున్నారు.

**ఆర్థిక స్వేచ్ఛ:** పిల్లల పోషణ, చదువులకు అయ్యే ఖర్చు ఇండియాలో చాలా పెరిగింది. ఆ ఖర్చు ఆదా చేసి.. ఆ మొత్తాన్ని తమ సొంత రిటైర్మెంట్ లేదా విలాసాల కోసం ఇన్వెస్ట్ చేస్తున్నారు.

**కెరీర్ గ్రోత్:** నేటి పోటీ ప్రపంచంలో కెరీర్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి చాలా టైమ్ అవసరం. పిల్లల బాధ్యత లేకపోతే ఉద్యోగంలో రిస్క్‌లు తీసుకోవడం, వేరే నగరాలకు మారడం ఈజీ అవుతుందని కపుల్స్ భావిస్తున్నారు.

**వ్యక్తిగత స్వేచ్ఛ:** నచ్చినప్పుడు టూర్లకు వెళ్లడం, హాబీలను కొనసాగించడం పిల్లలు ఉన్నప్పుడు కొంత కష్టం. డింక్ జంటలు తమ జీవితాన్ని తమకు నచ్చినట్లు గడపడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.


**మానసిక ప్రశాంతత:** పిల్లల పెంపకం పెద్ద బాధ్యత అని భావించి ఆ ఒత్తిడి తీసుకోలేమని ఇలా ఆలోచిస్తున్నారు. పార్టనర్‌తో ఎక్కువ టైమ్ స్పెండ్ చేయడమే బెటర్ అనుకుంటున్నారు.

ఏఐ ఫొటో

## అమెరికాలో పుట్టిన డింక్

1980లో 'డింక్' అనే పదం అమెరికాలో వాడుకలో ఉన్నప్పటికీ.. సోషల్ మీడియా ప్రభావంతో ఇప్పుడు ట్రెండ్ అవుతున్నది. 'గిట్నక్స్ మార్కెట్ డేటా రిపోర్ట్' ప్రకారం.. ఇండియాలో డింక్ జంటల సంఖ్య ఏటా 30 శాతం పెరుగుతున్నది. 2011 సెన్సస్ ప్రకారం.. 42 శాతం గ్రామీణ కుటుంబాల్లో (ఇద్దరు సభ్యులున్నవి), పట్టణాల్లో 22 శాతం ఈ ట్రెండ్ ఉంది.

- ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి వేదికలపై డింక్ కపుల్స్ .. విలాసవంతమైన ప్రయాణాలు, మానసిక ప్రశాంతతకు సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. డింక్ వ్లాగ్స్ రూపంలో షేర్ చేస్తూ లక్షలాది వ్యూస్ సంపాదించుకుంటున్నారు. ఈ వీడియోలు చూసే యువత.. ఆ విలాసాలకు ఆకర్షితులై డింక్ మార్గాన్ని ఎంచుకోవడానికి ప్రేరణ పొందుతున్నారు.
- కొంత మంది కపుల్స్ జింక్ అని పిలుచుకుంటున్నారు. జింక్ అంటే.. 'గ్రీన్ ఇన్‌క్లినేషన్, నో కిడ్స్'. పెరిగిపోతున్న జనాభా, వనరుల కొరత, క్లైమేట్ చేంజ్ వంటి కారణాలతో పిల్లలను కనడం కరెక్ట్ కాదనుకుంటున్నారు.
- పిల్లల కోసం ఖర్చు చేసే డబ్బును సమాజంలోని అణగారిన వర్గాల కోసం లేదా మూగ జీవాల కోసం ఖర్చు పెట్టాలని డింక్ కపుల్స్ భావిస్తున్నారు.





## డింక్ సవాళ్లు ఏంటి?

పిల్లలను కనకపోవడం స్వార్థమని సమాజం ముద్ర వేస్తున్నది. మహిళలపై కుటుంబం, బంధువుల నుంచి తీవ్ర ఒత్తిడి ఉంటున్నది. ముసలితనంలో చూసుకోవడానికి ఎవరూ ఉండరని ఆందోళనపడుతున్నారు. దీని కోసం భారీగా రిటైర్మెంట్ ఫండ్స్, పెయిడ్ కేర్ టేకర్లపై డిపెండ్ అవుతున్నారు. ఫ్రెండ్స్, కో–వర్కర్లకు పిల్లలు పుట్టి వారు బిజీ అయిపోయినప్పుడు, డింక్ జంటలు సామాజికంగా ఒంటరితనాన్ని అనుభవించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## సెల్ఫ్ డిస్కవరీకి ఇంపార్టెన్స్

మునుపటి తరాల వాళ్లు సామాజిక నిబంధనలను పాటించేవారు. కానీ, నేటి తరం వ్యక్తిగత స్వేచ్ఛకు, కెరీర్‌కు, సెల్ఫ్ డిస్కవరీకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒక మహిళ విలువ ఆమె మాతృత్వంపై మాత్రమే ఆధారపడి ఉండకూడదనే ఆలోచన బలపడుతున్నది. నాగ్‌పూర్‌కు చెందిన హర్లీన్ విజ్ వంటి వాళ్లు ఇదే భావజాలంతో తమ భాగస్వాములను ఎంచుకుంటున్నారు.

- డింక్ వైపు వెళ్లాలంటే కపుల్స్ మధ్య కమ్యూనికేషన్ బలంగా ఉండాలి. పిల్లలు లేనప్పుడు మద్దతుగా నిలిచేలా స్నేహితుల బృందం ఉండాలి. పిల్లలు లేరు కదా అని కేవలం పనిలోనే మునిగిపోకుండా..మానసిక ఆరోగ్యం కోసం సొంతంగా సమయం కేటాయించుకోవాలి.

## కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం

ఇండియాలో ప్రాచీన కాలం నుంచి ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. గత 4 దశాబ్దాలుగా ఉపాధి వేటలో యువత నగరాలకు తరలిపోవడంతో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై న్యూక్లియర్ కుటుంబాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఈ చిన్న కుటుంబ వ్యవస్థ కూడా డింక్ రూపంలో మరో ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఆర్థిక స్వేచ్ఛ, కెరీర్ ఎదుగుదల కోసమే ఈ నిర్ణయం తీసుకుంటున్నామని జంటలు వాదిస్తున్నాయి.





### ప్రకృతి నియమానికి విరుద్ధం

సంతానోత్పత్తి అనేది ప్రకృతి నియమం. దీనిని అతిక్రమిస్తే సమాజ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. ఇప్పటికే వెస్ట్రన్ కంట్రీస్‌లో యువ జనాభా తగ్గి, వృద్ధుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం ఆ దేశాలను ఆందోళనకు గురి చేస్తున్నది. భారతీయ సామాజిక వ్యవస్థలో పిల్లలు కేవలం వారసులు మాత్రమే కాదు, కుటుంబంలోని ఆనందానికి, సంతోషానికి వారే మూలాధారం. బిహేవియరల్ సైన్స్ నిపుణుడు బిజూ డొమినిక్ అభిప్రాయం ప్రకారం.. ''మనుషులకు భవిష్యత్తు గురించి లోతుగా ఆలోచించే సామర్థ్యం తక్కువ. పిల్లలు ఉంటే సహజంగానే భవిష్యత్తు గురించి పక్కా ప్రణాళికతో కష్టపడేతత్వం పెరుగుతుంది''

## ఒకప్పుడు 'హమ్ దో - హమారే దో'

'హమ్ దో - హమారే దో' (మేమిద్దరం - మాకిద్దరు) – 1970, 80వ దశకాల్లో కుటుంబ నియంత్రణ కోసం ప్రాచుర్యం పొందిన ఈ నినాదం బహుశా ఇప్పటి యువతకు పెద్దగా తెలియకపోవచ్చు. దేశంలో పేదరికం ఎక్కువగా ఉన్న కాలంలో, అధిక సంతానోత్పత్తి రేటును తగ్గించడానికి ప్రభుత్వం ఆ నాడు ఈ నినాదాన్ని రూపొందించింది. అది 'ఎమర్జెన్సీ', 'నస్బందీ' (కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు) అనే పదాలను ప్రతికూలంగా చూసే రోజులు. కానీ కాలం మారింది. ఆధునిక చరిత్రలో తొలిసారిగా.. ఈ శతాబ్దం చివరి నాటికి ప్రపంచ జనాభా వృద్ధి ఆగిపోయే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి గణాంకాలను విశ్లేషిస్తూ 'ప్యూ రీసెర్చ్ సెంటర్' పేర్కొంది.




## పెట్ పేరెంటింగ్స్ వైపు నడక

డింక్ కపుల్స్ పెంపుడు జంతువుల వైపు మొగ్గు చూపుతున్నారు. కుక్కలు, పిల్లులపై తల్లిదండ్రుల వంటి ప్రేమను కురిపిస్తూనే.. తక్కువ బాధ్యతతో సరిపెట్టుకుంటున్నారు. మరికొందరు ప్రయాణాలు, అడ్వెంచర్ స్పోర్ట్స్ కోసం ఉపయోగిస్తున్నారు. అమెరికాలో పిల్లలున్న కుటుంబాలు నగర శివార్లకు మారుతుండగా.. న్యూయార్క్, లాస్ ఏంజిల్స్ వంటి నగరాల్లో ఐదేండ్లలోపు పిల్లల సంఖ్య వేగంగా తగ్గుతున్నది. ఇండియాలో ఐటీ, అడ్వర్టైజింగ్ వంటి కార్పొరేట్ రంగాల్లోని జంటలు పని ప్రదేశానికి దగ్గరగా ఉండే చిన్నపాటి విలాసవంతమైన ఫ్లాట్లలో ఉంటూ, ఖాళీ సమయాన్ని సోషలైజింగ్ లేదా ఖరీదైన సెలవుల కోసం కేటాయిస్తున్నారు.




## యూరప్, లాటిన్ అమెరికాపై ఎఫెక్ట్

**ప్రపంచవ్యాప్త ధోరణి 2050 నుంచి 2100 మధ్య కాలంలో దాదాపు 90 దేశాల్లో జనాభా క్షీణించనున్నది. వీటిలో మెజారిటీ దేశాలు యూరప్, లాటిన్ అమెరికాకు చెందినవి. ఈ శతాబ్దం అంతటా జనాభా వృద్ధిని కనబరిచే ఏకైక ప్రాంతం ఆఫ్రికా మాత్రమే. 2020లో 1.3 బిలియన్లుగా ఉన్న ఆఫ్రికా జనాభా 2100 నాటికి 4.3 బిలియన్లకు చేరుతుందని అంచనా. దక్షిణ కొరియాలో పడిపోతున్న సంతానోత్పత్తి రేటు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వం ఎన్ని రాయితీలు ప్రకటించినా..నాయకులు ఎంతగా బతిమాలినా అక్కడి జంటలు పిల్లలను కనడానికి సిద్ధంగా లేరు. ఇదే ధోరణి కొనసాగితే..ప్రస్తుతం 5.16 కోట్లుగా ఉన్న ఆ దేశ జనాభా 2100 నాటికి సగానికి పడిపోయి.. నేషనల్ ఎక్స్టిన్షన్‌సంభవిస్తుందేమో అని భయపడుతున్నారు.**




## తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు

ఇండియాలో కూడా సంతానోత్పత్తి రేటు తగ్గుతున్నది. యువ జంటల్లో డింక్ కల్చర్ సంస్కృతి పెరుగుతున్నది. 2050 నాటికి దేశ సంతానోత్పత్తి రేటు తిరిగి కోలుకోలేనంతగా ప్రతీ జంటకు 1.29కి పడిపోతుందని లాన్సెట్ సంస్థ గతంలోనే అంచనా వేసింది. దీనివల్ల ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులుగా ఉంటారు. ఇది పని చేసే శక్తి తగ్గిపోయి ఉత్పాదకతపై ప్రభావం చూపుతుంది. 1950లో 6.18గా ఉన్న సంతానోత్పత్తి రేటు, 1980 నాటికి 4.60కి, 2025 నాటికి 1.91కి తగ్గింది. వైద్య సదుపాయాలు పెరగడంతో పిల్లలు ఆరోగ్యంగా బతికే అవకాశం పెరిగింది.దీంతో ఎక్కువ మంది పిల్లలను కనాల్సిన అవసరం తగ్గింది. గతంలో పిల్లలను వృద్ధాప్యానికి పెట్టుబడిగా చూసేవారు. కానీ, నేడు పిల్లల పెంపకానికి అయ్యే ఖర్చు, భవిష్యత్తులో వారి నుంచి వచ్చే ప్రతిఫలం కంటే ఎంతో ఎక్కువగా ఉంది.

## దక్షిణాదిలోనే ఎక్కువ డింక్ కపుల్స్

డింక్ కపుల్స్ సంఖ్య ఎక్కువగా దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కువ ఉంది. కేరళ, తమిళనాడు, ఏపీ, తెలంగాణలో సంతానోత్పత్తి రేటు జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. ఇక్కడ విద్యావంతులైన జంటలు కెరీర్, జీవన ప్రమాణాల కోసం పిల్లలను వద్దనుకోవడం లేదా వాయిదా వేయడం ఎక్కువగా కనిపిస్తున్నది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ , ముంబై, బెంగళూరు, పుణె, హైదరాబాద్, కోల్‌కతా నగరాల్లో ఈ సంస్కృతి ఎక్కువ ఉంది. ఇక్కడ ఉన్న ఐటీ, కార్పొరేట్ ఉద్యోగుల్లో ఈ ట్రెండ్ వేగంగా పెరుగుతున్నది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, బ్యాంకర్లు, అడ్వర్టైజింగ్, మీడియా రంగాల్లో పనిచేసే జంటలు డింక్‌ను ఎంచుకుంటున్నారు. పని ఒత్తిడి, కెరీర్ మీద ఉన్న మక్కువతో వీరు పిల్లల బాధ్యతను తీసుకోవడానికి ఇష్టపడటం లేదు.





## 21 ఏండ్లు @ ఖర్చు రూ.3 కోట్లు

పట్టణ ప్రాంతాల్లో ఒక బిడ్డను 21 ఏండ్ల వయస్సు వరకు పెంచడానికి సుమారు రూ.1.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఖర్చవుతున్నది. ఇండ్ల నిర్మాణం, వైద్య ఖర్చులు ఇప్పటికే ఆకాశాన్ని తాకుతున్న వేళ, ఈ ఖర్చు చాలామందికి భారంగా అనిపిస్తున్నది. బెంగళూరు, గురుగ్రామ్, పుణె, హైదరాబాద్ వంటి నగరాల్లో నివసించే డింక్ జంటలు తమ కెరీర్ వృద్ధికి, ప్రమోషన్లకు, విదేశీ అవకాశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయి.

- షాదీ డాట్ కామ్ నివేదిక ప్రకారం..కొన్ని రాష్ట్రాల్లో దాదాపు 65% మంది నూతన వధూవరులు సంతానాన్ని వాయిదా వేయడం లేదా పూర్తిగా వద్దనుకోవడం వంటి నిర్ణయాలను బహిరంగంగానే చర్చిస్తున్నారు. సోషల్ మీడియాలో #ChildfreeIndia వంటి హ్యాష్‌ట్యాగ్‌లు దర్శనం ఇస్తున్నాయి.

## ఇండియాలో డింక్ ప్రయోజనాలు

పిల్లల పెంపకం ఖర్చులు లేకపోవడంతో డింక్ కపుల్స్ డబ్బులు ఆదా చేసి ఇన్వెస్ట్‌మెంట్లు చేస్తున్నారు. దీనివల్ల వారు 'FIRE' (ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్, రిటైర్ ఎర్లీ) సాధించే అవకాశం మెరుగ్గా ఉంటుంది. అలాగే, మహిళలు మాతృత్వాన్ని ఒక బాధ్యతగా కాకుండా ఆప్షనల్‌గా చూడటంతో వారి స్వయంప్రతిపత్తి పెరుగుతున్నది. లగ్జరీ ట్రావెల్ నుంచి రియల్ ఎస్టేట్ వరకు ఈ జంటలు ఎక్కువ ఖర్చు చేయడంతో దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తున్నది. జనాభా పరంగా చూస్తే, పట్టణాల్లో జననాల రేటు తగ్గడంతో వనరులపై ఒత్తిడి తగ్గుతుంది.

